# ఆదర్శానికో మినహాయింపు

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

"కంగ్రాచ్యులేషన్స్!"

తల వంచుకుని డిసెక్షన్ బాక్స్ లోని పరికరాలని బయటికి తీస్తున్న సాధన తల ఎత్తి అతని వంక చూపింది.

"కంగ్రాచ్యులేషన్స్!" మళ్ళీ చెప్పాడు శ్రీహర్ష.

"థ్యాంక్యూ!" చిరునవ్వుతో వినయంగా చెప్పింది సాధన.

"చాలా చక్కగా మాట్లాడారు."


"మీరూ చక్కగా వాదించారు. అది ప్రోగ్రెసివ్ థాట్ కాదు కాబట్టి, నా కిచ్చారు బహుమతి. అంతకంటే మరేం లేదు."

"నిజంగా చక్కగా దబాయించి మాట్లాడారు. కట్నం అడగడం ఎంత తప్పో, ఇవ్వటం కూడా అంత నేరమని చెప్పారు."

డిమాన్‌స్ట్రేటర్ వచ్చి అడిగాడు శ్రీహర్షని.

"మిమ్మల్నెప్పుడూ చూడలేదు. కొత్తగా చేరారా?"

"లేదు. నేను కామర్స్ గ్రూప్



కథా నిలయం
శ్రీకాకుళం

వాడిని. వెళ్ళిపోతున్నాను."

బయటికి వచ్చాడు సైన్స్ లాబ్ లోంచి ఆ తర్వాత అనేక సార్లు సాధన కనపడింది శ్రీహర్షకి. అతను పలకరించ లేదు. ఆ అమ్మాయి కూడా శ్రీహర్షతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. అరుదుగా ఒకరి మొహంలోకి మరొకరు ఒకే సమయంలో చూసుకునే వాళ్ళు. అలా కళ్ళు కలిసినప్పుడు మాత్రం పలకరింపుగా నవ్వుకునేవారు.

పరీక్షలు అయిపోయాయి. శ్రీహర్ష పి. యు. సి. పాసయి బి. కాం. లో చేరాడు అదే కాలేజీలో. సాధన కూడా పాసయింది సెకండ్ క్లాస్‌లో. కాని కాలేజీలో చేరలేదు. కారణం శ్రీహర్షకి తెలియదు. డిగ్రీ చదివించటం యిష్టం లేక సాధన తండ్రి పై చదువుకి వప్పుకోలేదు. మరో కాలేజీలో చేరి వుండవచ్చునుకున్నాడు శ్రీహర్ష.

బి.కాం. అయ్యాక శ్రీహర్ష విజయవాడలోనే స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియాలో టెంపరరీగా చేరాడు. ఎనిమిది నెలలు పనిచేసాక అది వూడింది. ఓ ప్రయివేట్ కంపెనీలో క్లర్క్‌గా తక్కువ జీతానికి చేరాడు.

తర్వాత స్టేట్ బాంక్‌లో ఇంటర్వ్యూ, వుద్యోగం అనుకోకుండా వచ్చాయి. రెండు సంవత్సరాల తర్వాత హైద్రాబాద్ బదిలీ అయింది కూడా.

ఓ సారి బెజవాడ వచ్చినప్పుడు శ్రీహర్ష తండ్రి, వివాహ ప్రసక్తి తీసుకువచ్చాడు కొడుకు ముందు.

"మీ ఇష్టం." తన అంగీకారాన్ని తెలియజేసాడు.

"నలుగు రయిదుగురు పెళ్ళికూతుర్ల తండ్రులు తిరుగుతున్నారు. చూస్తావా వాళ్ళని? ఎవరు నచ్చితే వాళ్ళని చేసుకుందువుగాని. చైత్ర మాసంలో ముహూర్తాలున్నాయి."

"అలాగే. కాని ఒక్క విషయం."

"చెప్పు!"

"నాకు కట్నం తీసుకోవటం ఇష్టం లేదు."

"అది నీకు ఇవ్వం. మేమే తీసుకుంటాం." నవ్వాడాయన.

"అసలు నయాపైస కూడా తీసుకోవడం నా కెంత మాత్రం ఇష్టం లేదు నాన్నగారూ!"

"ఎందుకు?"

"ప్రిన్సిపల్."

"అలా కుదరదోయ్! ఇది ఆచారం. అయినా కట్న కానుకల విషయం మాకు వదిలి, మిగతా సంగతులు నువు చూసుకో."

"అలా అయితే అసలు ఇప్పట్లో నాను పెళ్ళొద్దు. నేను ఎవరినీ చూడను."

"ఏమిటీ తల తిక్క?" శ్రీహర్షని అతని తల్లి కోప్పడింది సంగతి తెలిసి.

ఎవరినీ చూడకుండా హైద్రాబాద్ వెళ్ళిపోయాడు. అయిదారు నెలల తర్వాత అతని తల్లిదండ్రులకి అర్థమైంది- శ్రీహర్ష కట్నం విషయంలో చాలా నిక్కచ్చిగా వున్నాడని. వాళ్ళకి అతనితో రాజీకి రాక తప్పలేదు. కేవలం పెళ్ళి ఖర్చులు మాత్రం తీసుకునేందుకు వప్పించారు శ్రీహర్షని.

విజయవాడ వచ్చాడు శ్రీహర్ష. అయిదారుగురు పిల్లలని చూసాడు వారం రోజుల్లో. వాళ్ళలో సాధన వుంది.

ఒకరి నొకరు గుర్తుపట్టి పలకరించుకున్నారు పెద్దవాళ్ళ ముందే.

"ఎస్. ఆర్. ఆర్. లో చదివారు కదూ?" అడిగాడు.

తల వూపింది సాధన.

"మీకు డౌరీ సిస్టమ్ మీద డిబేట్ లో ప్రయిజ్ కూడా వచ్చింది కదూ?"

మళ్ళీ తల వూపింది.

"సారీ- మీ పేరు మరిచాను. మా వాళ్ళు 'పాప' అని చెప్పారు."

"ఇంట్లో 'పాప' అంటారు, సాధన."

"ఇది వరకే తెలుసా ఈ అమ్మాయి?" అడిగింది శ్రీహర్షని అతని తల్లి.

తలవూపి కాలేజీలో జరిగిన డిబేట్ గురించి చెప్పాడు.

"అప్పుడు కట్నం తీసుకోవాలని వాదించి ఇప్పుడు అసలొద్దంటున్నాడు మా వాడు." నవ్వుతూ చెప్పాడు శ్రీహర్ష తండ్రి సాధన తల్లిదండ్రులతో.

పెళ్ళి చూపులయాక ఇంటికి వచ్చారు.

"బావుంది అమ్మాయి. జాతకాలు కుదిరితే ముహూర్తం పెట్టుకోవచ్చని చెప్పాను. ఆయన సాయంత్రం రావచ్చు." చెప్పాడు శ్రీహర్షతో అతని తండ్రి.

"అలాగే."

"కట్న కానుకలు మాట్లాడే ప్రసక్తే లేదు. ఇది ఖాయం అవుతుంది" అన్నది శ్రీహర్ష తల్లి; కొద్దిగా సంతోషంగా, కొద్దిగా నిష్టూరంగా.

శ్రీహర్ష హైద్రాబాద్ వెళ్ళిపోయాడు. నెలా పదిహేను రోజుల తర్వాత ముహూర్తం నిర్ణయించారు- 18 వ తారీకున.

ఓ రోజు లోకల్ హెడ్ ఆఫీ

స్‌కి రిజిష్టర్ పోస్ట్‌లో వుత్తరం వచ్చింది శ్రీహర్షకి. తనకి ఎవరు రిజిష్టర్ పోస్ట్‌లో ఆ వుత్తరం రాసారో అర్థం కాలేదు శ్రీహర్షకి, ఆ చేతివ్రాత కొత్త కాబట్టి.

సంతకంచేసి కవరు అందుకుని చింపి, కాగితం బయటికి తీసాడు.

'శ్రీవారికి' అనే సంబోధన చూడగానే కొద్దిగా థ్రిల్ కలిగింది. ఇంతదాకా 'డియర్': 'చిరంజీవి' తప్ప ఆ విధంగా ఎవరూ సంబోధించలేదు, అవకాశం రాలేదు కాబట్టి.

క్రింద సంతకం చూసాడు.

'సాధన.'

గబగబా చదివాడు.

"శ్రీవారికి,

ఈ వుత్తరం చదవగానే చింపేయండి. మీరు కట్నం తీసుకోనని గట్టి పట్టుపట్టారని తెలిసింది. నా పెళ్ళికి కట్నం కోసం మా నాన్నగారు బాంక్‌లో ఎనిమిది వేల రూపాయలు వేసి వుంచారు. దయచేసి కట్నం వద్దనకండి. కట్నం ఇవ్వలేని వాళ్ళ దగ్గర రాబందుల్లా పీక్కు-న్నా, లేక తక్కు-వ ఇవ్వగలిగే వాళ్ళని ఎక్కు-వ ఇవ్వమని బాధించినా తప్పు. ఇవ్వగలిగే వాళ్ళ దగ్గర కూడా వద్దనటం పిచ్చితనం లేదా అతి మంచితనం అవుతుంది. పెళ్ళయిన మరుక్షణం అవసరానికి ఓ వెయ్యి అప్పు ఇవ్వమని అడిగి చూడండి మా నాన్నగారిని-ఇస్తారేమో? ఇవ్వరు. మీకు ఆ డబ్బు ముట్టుకోవడం ఇష్టం లేకపోతే, బాంక్‌లో వేసి వుంచితే మన పిల్లల పెళ్ళిళ్ళకయినా వాడుకోవచ్చు భవిష్యత్తులో. మీ కన్నా చిన్నదాన్నయినా నాకు తోచిన సలహా ఇస్తున్నాను. తర్వాత మీ ఇష్టం. ఈ సంగతి ఎవరికీ తెలియనివ్వరనే ధైర్యంతో రాస్తున్నాను.

మీ సాధన."

శ్రీహర్ష రెండు రోజుల తర్వాత తన తండ్రికి వుత్తరం రాసి పడేసాడు-కట్నం తీసుకోవడం తనకు సమ్మతమేననీ, ఎనిమిది వేలకు తక్కు-వయితే వప్పుకోవద్దనీ.

వివాహం అయ్యాక శోభనం రోజు రాత్రి సాధన మొదట అడిగిన ప్రశ్న—

"నా వుత్తరం మీకు ఆశ్చర్యం కలిగించిందా?"

"అవుకు- కాదు."

"అంటే?"

"ఏంలేదు." దగ్గరికి తీసుకున్నాడు.

శ్రీహర్ష అగరుబత్తుల స్టాండు వంక చూసాడు. ఆరు అగరుబత్తులు వెలుగుతున్నాయి దాంట్లో. పొగవస్తోంది ఆరిటినుంచీ.

సాధనకి డిబేట్‌లో వచ్చిన ప్రయిజ్ ఆ అగరబత్తి స్టాండ్. ●